# "చిటీ బస్సుకీ జై..."

దండాలండి బావు.

మరి తవరికోమాట సెబ్దామని... ఈ మాట సెపంచంలో అందరూ, ముక్కెంగా తల్లులు - తల్లులందరూ జాగర్తగా ఇనుకోవలసిన మాటండి మరి.

మరండి, గతంలో మా ఆడదానికో సొలి పురుడయివాదండి. పురుడయివాదంతే అవ్వనేదనుకొండి-లేటయివాదండి. సరిగ్గా వ్వది మాసాలు కంప్లీట్టయి పోనాయి గానీ డెల(వ)రీ కావేదండి. నొప్పులు మాత్తరం ఎండా కాలంలో సెమటుల్లాగ వత్తన్నాయి-పోతన్నాయి.

ఆరోజు మాత్తరం మాసెద్ద సీకాకయిపోనాదండి. నొప్పులు ఎక్కువయి 'ఓఅమ్మో, ఓల్నాయనో' అని మమ్మలు సుట్టుకుపోయి అద సుత్తుంతే 'సీ...సీ... మదుసులికీ, పశూలికీ ఆ మాత్తరం తేడా నేకపోయిందా' ని బాదపడిపోనానండి.

ఇసాపట్నంలో చిటీ బస్సువొచ్చి మా రిచ్చావోల్ల బతుకులు ఎంత సెడిపోయినాయంతే మంత్రసాని కూడా పలకనంతండి.

ఈ టయాంలో ఏం సెయ్యాలో తెలీక కాల్లూ సేతులు వొడికినాయండి. మరి వొడకడంవంటే ఇలా



గలాగ్గాదండి. అర్ధరేత్రి పన్నిండు గంటలికి ఎదట్నేల బడి నాగుపాము 'బుస్' మన్నాదనుకొండి-మరిగలాగిండి.

మా అత్తా మావ లబోదిబోమన్నారండి. మా ఆడదాని నొప్పుల్తోటి, మా మావ మూల్గుల్తోటి, మా అత్త అచ్చింతల్తోటి నా 'గుండె గొంతుకులో'కొచ్చేసినాదండి.

సరిగ్గా నపుడే నాకో అయిడియా కూడా ఒచ్చినాదండి.

ఎంటనే మా ఆడదాన్ని కేకేసి 'అరిజెంటుగా సివ్వాసెలం ఎల్లాల, ఆ బావుకి దండం పెట్టుకుంది వనిజెప్పి, మంచంమీద ఆయేస పడిపోతన్నదాన్ని బయల్దేరిచ్చినానండి...

ముందు నాను ననుమానించినట్టే సివ్వాసెలంలో దిక్కుముందే మా ఆడదానికి సుకంగా పురుడయిపోడం. బస్సులోనే బంగార్లాంటి 'బంగారం' పుట్టడం జరిగిపోనాదండి.

అద్గదండీ కత.

అదంతా ఆ సివ్వాసెలం దేవుడోరి దయని ఆలంతా ఆడికి దండవెట్టేసినారండి.

మరి నానేటన్నాను—

"ఇసాపట్నం చిటీ బస్సుకీ జై...!"

—భారత్

## కాలందాటని కథలు

# "ఓ నిక్కర్ కథ!"

సుబ్బారావు మరుసటిరోజు జరిగే పెళ్ళికి వెళ్లే ఏర్పాట్లో వున్నాడు. బంధువుల్లో పెళ్లి కాబట్టి కాస్త ఘనంగానే వెళ్లాలనిపించిందతనికి. అందుకని సాయంకాలం కాగానే షాపింగ్‌కు బయల్దేరాడు. ముందుగా ఒక జత రెడీమేడ్ బట్టలు తీసుకొని, తరువాత బాటా షాపులో చెప్పులు కొన్నాడు. తీరా యింటికొచ్చి చూస్తే, పాంటు నాలుగంగుళాలు పొడుగ్గా వుంది. పెళ్లికి అది వేసుకెళ్తే, అందరి కళ్లూ తన మీదే వుంటాయని, కుట్టు మిషను మీద పని చేసుకొంటున్న అక్కయ్యను అడిగాడు పాంటు సరిచేసిమ్మని. కాని తనకు కుదరదని ఆమె విసుక్కొంది. తరువాత వంటింట్లో వున్న తల్లిని అడిగాడు, ఆమె కూడ అలాగే విసుక్కొంది. చివరి సారిగా చెల్లెల్ని అడుగుదామని వెళ్తే ఆమె కాళ్లకు, చేతులకు గోరింటాకు పూసుకొని బొమ్మలా కూర్చుని వుంది. ఇంకేమడుగుతాములే అని ప్రక్కింటావిడ దగ్గరకు వెళ్లి పాంటు కుట్టించుకు వచ్చి, చొక్కాని, పాంటుని కొక్కేనికి తగిలించి వాటిని చూస్తూ మురిసిపోతూనే నిద్రలోకి జారిపోయాడు.

మిషను మీద పనులన్నీ అయిన తర్వాత సుబ్బారావు అక్క, యిందాక తమ్ముడి అభ్యర్థనను గుర్తు తెచ్చుకొని, తమ్ముడి మీద బోల్డంత జాలిపడి కొక్కేనికి తగిలించి వున్న పాంటును నాలుగంగుళాలూ కత్తిరించి కుట్టి, ఒక చీటీ మీద "తమ్ముడూ! నీవు చెప్పిన పని చేసాను, యిక సంతోషించు" అని వ్రాసి క్రొత్త చొక్కా జేబులో పెట్టింది. కొంచెంసేపటి తరువాత సుబ్బారావు తల్లి వంటింట్లో పనులన్నీ ముగించుకొని వచ్చి అతని పాంటుని కత్తిరించి కుట్టింది. ఆమె కూడ ఓ చీటి వ్రాసి దిండు క్రింద పెట్టి వెళ్లింది. తరువాత బాత్‌రూంలో స్నానం ముగించుకొని వస్తూ సుబ్బారావు చెల్లెలు కిటికీ నుండి అన్నయ్యను చూసి జాలిపడి, అడగక పోయినా కుట్టివుంచితే అన్నయ్య సంతోషిస్తాడని, ఆమె కూడా పాంటును ఓ నాలుగంగుళాలు కత్తిరించి కుట్టి జేబులో చీటి రాసి పెట్టింది.

ప్రొద్దున లేస్తూనే సుబ్బారావు దిండు క్రిందన రెపరెపలాడుతున్న చీటీని చదివి బావురుమన్నాడు. కొక్కేనికి తగిలించి వున్న క్రొత్త చొక్కా తీస్తే అక్కడ పాంటుకు బదులు ఓ 'నిక్కర్' వుంది!

ఈకథకు "B.B.C. (Hindi) పిల్లల కార్యక్రమం"లో ఒక జోక్ ఆధారం.

—మొహమ్మద్ అజ్మత్

# "తెల్గూమాన్"

ఢిల్లీలో అప్పారావ్ రైలెక్కాడు. జనరల్ కంపార్ట్‌మెంట్‌లోకి దూసుకుపోయి విండో దగ్గర సీటు సంపాదించుకున్నాడు. నెమ్మనెమ్మదిగా ఆ కంపార్ట్‌మెంటంతా నిండిపోయింది. ట్రైన్ బయలు దేరింది. అప్పారావ్‌కి ఎదురుగా కూర్చున్నాయన రెండు ఇంగ్లీష్ సినిమా పత్రికలు కొనుక్కుని తెచ్చుకున్నాడు. ఒకటి తాను చదువుతూ యింకోటి తన పక్కనే వున్న సీటు మీదుంచాడు.

అయిదు నిమిషాలు గడిచాయి. అంత వరకూ కిటికీలోంచి బయటకు చూస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న అప్పరావ్ హఠాత్తుగా తలతిప్పి ఎదురుగా కూర్చున్నాయన్ని, ఆయన సినిమాపత్రికలని చూశాడు. అంతే. వెంటనే వొంగి సినిమా పత్రికని చేతిలోకి తీసుకుని పేజీలు తిరగెయ్యటం ప్రారంభించాడు (సొంతదారుని అనుమతి లేకుండానే). ఆయన ఓరగా ఒకసారి అప్పారావ్ వంక చూసి పత్రిక చదూకోవటంలో మునిగి పోయాడు.




ఓ పావుగంట గడిచింది. అప్పారావ్ సినిమాపత్రిక "పని పట్టేసి" ఆయన పక్కనే నేర్పుగా విసిరేశాడు. ఆయనోసారి అసహనంగా అప్పారావ్ వంక చూసి మళ్ళీ చదువు కోవటంలో మునిగి పోయాడు. అప్పారావ్ ఒకసారి గట్టిగా ఒళ్ళు విరుచుకుని టైం చూసుకున్నాడు. వాచీ ఆగిపోయివుంది. అప్పారావ్ ప్రక్కనే కూర్చున్నాయన శ్రద్ధగా నవల చదువు కుంటున్నాడు. ఆయన చేతికి "సజీవమైన" వాచీ వుంది. అప్పారావ్ అమాంతం ఆయన చేతిని తిప్పేసి ఆయన వాచీలో టైం చూశాడు. కోపంగా చూశాడాయన అప్పారావ్ వైపు. అప్పారావ్ ఆయన వైపు చూసి నిదానంగా ఓ చిరునవ్వు నవ్వేసి కిటికీలోంచి ప్రకృతి సౌందర్యాన్ని చూడ్డంలో మునిగి పోయాడు.

రైలు ఒక స్టేషన్‌లో ఆగింది. అప్పారావ్ దిగబోతుండగా అంతవరకూ అప్పారావ్ "దుశ్చర్య"లను గమనిస్తున్న ఒకాయన అప్పారావ్‌ని ఆపి హిందీలో అడిగాడు.

"మీరు తెలుగు వారా?"

—కె.వి.రమణమూర్తి